# పాదపూజ

వటపత్రశాయిగారు మహామేధావి. గొప్ప పండితుడు, మంచిస్నేహశీలి. ఊర్లో ఎక్కడ ఏ సభజరిగినా, సమావేశమైనా ఆయన వేదిక ఎక్కి నాలుగు మాటలు చెప్పందే విడిచిపెట్టరు.

'వృత్తిరీత్యా ఉపాధ్యాయుడిని. ప్రవృత్తిరీత్యా ప్రజల మనిషిని' అంటారు. పెద్దంచు పొందూరు సన్న ఖద్దరు పంచె, కండువా, కంటి మెడ లాల్చీ, నుదుట సిందూరం బొట్టు మనిషి నీట్‌గా వుంటాడు. వయస్సు 65 సంవత్సరాలు.

భజరంగ్ యూత్ క్లబ్‌ని మూడు దశాబ్దాల క్రితం చిన్నారావు దాదా స్థాపించాడు. ఏటా గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రులు, వసంతోత్సవాల్లాంటివి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తూ వాటికి అవసరమైన డబ్బును డొనేషన్స్ రూపాన వసూలు చేస్తున్నారు చిన్నారావు దాదా, అతని శిష్యులు. వారి మాటకు ఎదురు చెప్పే ధైర్యం ఊర్లో ఎవరికీ లేదు. వారు అడిగినంత డబ్బు డొనేషన్ ఇవ్వాల్సిందే.

చిన్నారావు దాదా షష్టిపూర్తి ఫంక్షన్ ఎంతో ఘనంగా చెయ్యాలనుకున్నారు అతని శిష్యులు, యూత్ క్లబ్ మెంబర్స్. అవసరమైన ఏర్పాట్లు చేస్తూ సభా కార్యక్రమాన్ని పూర్తిగా నిర్వహించమని వారు వటపత్రశాయిగారిని కోరారు. ఖర్చు ఎంతయినా ఫర్వాలేదన్నారు. వటపత్రశాయిగారి ఆనందానికి అంతులేదు. అది ఆయనకు లభించిన గొప్ప గౌరవంగా భావించారు. ఇన్విటేషన్స్ వేయించి ఊర్లో పెద్దలకు స్వయంగా ఇచ్చారు. సన్మాన పత్రం తయారు చేయించారు.

"సభ ప్రారంభం కావడానికి రెండు గంటలు ముందుగా వచ్చి ఏర్పాట్లు చెక్ చేస్తా" నని భరోసా ఇచ్చారు.

అన్నట్లుగానే రెండుగంటలు ముందుగానే బయలు దేరారు వటపత్రశాయిగారు. వారు తమ ఇంటి సందు మలుపు తిరిగేసరికి ప్రముఖ వ్యాపారవేత్త మృత్యుంజయ రావు గారు మరణించారన్న కబురు వచ్చింది. లోగడ వటపత్రశాయిగారు ఎన్నో ఉపకారాలు పొందారు

మృత్యుంజయరావు గారివల్ల. వారి కుటుంబ సభ్యులను కలిసి తన సంతాపం తెలియజేసి మృత్యుంజయరావుగారి మృతదేహాన్ని చూడ్డం తక్షణ కర్తవ్యంగా తలచి అటు వెళ్లారు. అనుకోని పరిస్థితులవల్ల అక్కడ నుండి బయటకు వచ్చేసరికి చాలా ఆలస్యం అయింది.

ఇంటికి వెళ్లిరావడానికి వ్యవధిలేదు. ఆదరాబాదరాగా వేదిక చేరుకున్నారు. వచ్చిన జనాలు చాలా అసహనంతో ఉన్నారు. వారంతా వచ్చింది సన్మాన సభ తరువాత ప్రదర్శించబోయే పాదుకా పట్టాభిషేకం నాటక ప్రదర్శన కొరకు.

"ఏందయ్యా ఇది! ఏటైపోనావు? రాజకీయ నాయకుడివనుకున్నావేటి నాలుగ్గంటలు ఆలీసంగా రాడానికి? మావోల్లు నీ ఇంటి సుట్టూ ముమ్మారు తిరిగారు. బేగియెల్లి మీటింగ్ బిగిన్ సేయి" అంటూ చిందులు తొక్కాడు చిన్నారావుదాదా. వాడి శిష్యులు సరేసరి వటపత్రశాయిగారిని వేదికమీదకు నెట్టారు.

వటపత్రశాయిగారు ఆయాసంతో తడబడుతూ సభాకార్యక్రమం ప్రారంభించారు. ప్రధాన వక్తగా ఆయన చిన్నారావు గుణగణాలను కొనియాడుతూ "జాతస్యహిధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్యచ! పుట్టిన వానికి చావు తప్పదు. చచ్చినవాడు తిరిగి పుట్టక తప్పదు అన్నాడు కృష్ణపరమాత్మ. అందువల్లే 'అనిత్యాని శరీరాణి' కదా! ఎంతో ఉత్తముడు. గొప్పధార్మికుడు, దాత మన చిన్నారావుగారు ఈ రోజు మరణించడం ఎంతో విచారించతగ్గ విషయం" అని తన పొరపాటు గ్రహించి నాలుకకొరుక్కున్నారు వటపత్రశాయిగారు. ఆయన మృత్యుంజయరావుగారి మరణవార్త ఎంతకూ జీర్ణించుకోలేకపోవడంతో అనర్థం జరిగింది. అయితే వారు తన పొరపాటు గ్రహించి సరిదిద్దుకొనేసరికి లేటైంది. వేదిక ప్రక్కనే వున్న చిన్నారావుదాదా శిష్యులు వటపత్రశాయిగారికి పాదపూజ చేసారు.

**(ఆంధ్రభూమి వారపత్రిక, 30-12-1999)**